సాక్షి మంచిర్యాల

బుధవారం, 12, జూన్, 2024



పప్పుదినుసుల సాగుతో లాభాలు
తొలకరి సమయంలో పప్పుదినుసులు సాగు చేస్తే మేలు జరుగుతుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉందని పేర్కొంటున్నారు. 10లో▸



పారిశుధ్యం అస్తవ్యస్తం
మంచిర్యాల మున్సిపాలిటీలోని వార్డుల్లో డ్రెయినేజీ నీరు రోడ్లపై పారుతోంది. చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగించాల్సి ఉండగా.. పనులు ఆలస్యంగా చేపట్టారు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.0 /28.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

కరెంట్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ వినియోగం నెలవారీ బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి(ఎస్‌ఈ) శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్ విద్యుత్ మీటర్ రీడింగ్, చెల్లింపులు అన్ని స్మార్ట్‌ఫోన్ ఆన్‌లైన్ ద్వారా ఉంటుందని, వినియోగదారులు ఇంట్లో నుంచే నేరుగా చెల్లించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మే నెలలో 50,937 మంది వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించారని తెలిపారు. ప్రతీ నెల 20 శాతం మేర ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారని తెలిపారు. టీజీఎన్పీడీసీఎల్ మొబైల్ యాప్, www. tgnpdcl. com, గూగుల్ పే, ఫోన్ పే, పేటీయం ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. యూఎస్‌సీ నంబరును నమోదు చేసి బిల్లులు చెల్లింపు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే వినోద్



ఖర్గేతో వినోద్ కుటుంబ సభ్యులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కలిశారు. కుటుంబ సమేతంగా ఢిల్లీకి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ జరగనుందనే ప్రచారం జరుగుతున్న క్రమంలో ఆయనను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎమ్మెల్యే వెంట ఆయన భార్య, కూతురు, మనవడు, మనవరాలు ఉన్నారు.

ఆరోగ్య మిషన్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

పాతమంచిర్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఈ నెల 13న ఉదయం 10.30గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఎం, రిఫ్రిజిరేటర్ మెకానిక్, సీనియర్ డాట్స్‌ప్లస్ సహాయ సిబ్బంది, జిల్లా ఎకౌంట్స్ అధికారి జిల్లా ప్రోగ్రాం సమన్వయకర్త తదితర పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ జాబితాను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలోని నోటీస్ బోర్డు, మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. మెరిట్ జాబితాలో పేర్లు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రాపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో మంగళవారం హాజీపూర్ ఆహార ఉత్పత్తి సంస్థ(ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎఫ్‌పీసీ సలహాదారుడు గోనె శ్యాంసుందర్ రావు, డైరెక్టర్ పూస్కూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తమ అవసరాల కోసమైనా కనీసం ఒక 10 నుంచి 20 గుంటల్లో సేంద్రియ వ్యవసాయం చేపట్టాలని అన్నారు. ఎఫ్‌పీసీ డైరెక్టర్ బొద్దు శంకర్ మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ఎఫ్‌పీసీ ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు.

ఈసెట్ కౌన్సెలింగ్‌కు 190 మంది హాజరు



ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో రెండో రోజు మంగళవారం టీజీ ఈసెట్–2024 కౌన్సెలింగ్ కొనసాగింది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకుల ఆధారంగా స్లాట్ బుకింగ్ చేసుకుని విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్న తర్వాత విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. మొత్తం 190 మంది విద్యార్థులు ఈసెట్ కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్‌రెడ్డి తెలిపారు.

బడికి వేళాయె

- నేటి నుంచి పాఠశాలలకు విద్యార్థులు
- బడిబాటలో ఉపాధ్యాయులు నిమగ్నం
- అటకెక్కిన 'మన ఊరు–మన బడి' పనులు
- నత్తనడకన అమ్మ ఆదర్శ కమిటీ పనులు
- వెక్కిరిస్తున్న ఉపాధ్యాయుల ఖాళీలు



న్యూగర్మిళ్ల పాఠశాల

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవులు, ఆటపాటలకు టాటా చెబుతూ విద్యార్థులు పుస్తకాలు, బ్యాగులు పట్టి మూడు నెలల తర్వాత బుధవారం బడిబాట పట్టనున్నారు. 2024–25 విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడంతో సర్వం సిద్ధం చేశారు. చెత్తాచెదారం తొలగింపు, తరగతి గదుల శుభ్రం, పరిసరాల పారిశుధ్య పనులు చేపట్టారు. తాగునీరు, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఈ నెల 6నుంచి బడిబాటలో నిమగ్నమయ్యారు. కొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు ఇతరత్రా సమస్యలు ఉన్నాయి. ఉపాధ్యాయ ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. మన ఊరు–మనబడి పనులు అటకెక్కగా, అమ్మ ఆదర్శ కమిటీల పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పాఠశాలల్లో సందడి

విద్యార్థులకు స్వాగతం పలికేందుకు పాఠశాలలు ముస్తాబు అవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాటలో పిల్లలను చేర్పిస్తుండగా.. ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేశాయి. పదో తరగతి ఫలితాలు, ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రచారం జోరు పెంచాయి. జిల్లాలో 1081 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. 1,23,087 మంది విద్యార్థులు చదువుతున్నారు. 724 లోకల్‌బాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో 37,785 మంది విద్యనభ్యసిస్తున్నారు. 136 కేజీబీవీ, మోడల్, వెల్ఫేర్ హాస్టల్ ఇతర పాఠశాలల్లో 22,960 మంది చదువుతున్నారు. రెండు అన్ఎయిడెడ్(సీబీఎస్ఈ)లో 1170మంది, 218 ప్రైవేటు పాఠశాలల్లో 61,172మంది చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

తొలిరోజు పుస్తకాలు, యూనిఫాం అందజేత

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తొలి రోజే పుస్తకాలు, యూనిఫామ్ అందజేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. 3,04,310 పాఠ్యపుస్తకాలు అందజేయాల్సి ఉంది. 227 పాఠశాలలకు సంబంధించిన 2,49,446 నోట్‌పుస్తకాలు పాఠశాలలకు చే రాయి. మహిళా సంఘాలు జూన్ 10లోపు యూని ఫాంలను ఉపాధ్యాయులకు అప్పగించేలా అధికా రులు చర్యలు చేపట్టారు. రూరల్ ఏరియాలో 30,995 దుస్తులు, అర్బన్ ఏరియాలో 12,7189 యూనిఫాంలు అందించాలని నిర్ణయించారు. 90 శాతం దుస్తులు కుట్టడం పూర్తయిందని వెల్లడించా రు. ప్రభుత్వం కుట్టుకూలి రూ.50నుంచి రూ.75కు పెంచింది.

ఖాళీల భర్తీ ఎలా..?

సర్కారు బడుల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఓ వైపు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లకు రిలీవ్ ఆర్డర్ కాపీలు ఇవ్వడంతో కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేశారు. ఉద్యోగ విరమణతో ఖాళీ అయిన పోస్టులు భర్తీ కాలేదు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు నిపుణుల పోస్టుల భర్తీ అంతంత మాత్రంగానే మారింది. ఎస్జీటీల ప్రమోషన్లు, బదిలీలతో ఏర్పడిన ఖాళీలు మిగిలిపోనున్నాయి. 2,839 ఉపాధ్యాయులకు గాను 2,347 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం 492 ఖాళీలు ఉన్నాయి. గతేడాది 136 మంది టీచర్లను వర్క్ అడ్జస్ట్ పేరిట సర్దుబాటు చేశారు. వీవీల నియామకంపై ఎటూ తేల్చకపోవడంతో సర్దుబాటుతోనే చదువులు సాగిస్తారా..? అనేది తేలాల్సి ఉంది. బడుల పర్యవేక్షణలో కీలకమైన ఎంఈవో పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అసలే ఇంచార్జీలు కాగా ఒక్కొక్కరికి రెండు నుంచి నాలుగేసి మండలాలు అదనపు బాధ్యతలు అప్పగించారు. 18 మండలాల్లో ఏడుగురు మాత్రమే ఎంఈవోలు కొనసాగుతుండడం గమనార్హం.

నత్తనడకన పనులు

ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులు నిధుల లేమితో పడకేయగా.. అమ్మ ఆదర్శ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 243 పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు–మనబడి పనుల్లో 123 పనులు ఇన్‌ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. 478 బడుల్లో అమ్మ ఆదర్శ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో 456 బడుల్లో తాగునీటి పనులు చేపట్టగా 118 చోట్ల పూర్తి చేశారు. 210 చోట్ల మేజర్ అండ్ మైనర్స్ పనుల్లో 35 స్కూళ్లలో పూర్తయ్యాయి. 444 పాఠశాలల్లో టాయిలెట్స్ పనుల్లో 100 చోట్ల పూర్తికాగా మిగతావి ఇన్‌ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. 336 విద్యుద్దీకరణ పనులు కాగా 187పాఠశాలల్లో పూర్తయ్యాయి. వేసవిలో చేపట్టాల్సిన పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో విద్యార్థులకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేత

సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫామ్‌లు చేరాయి. బుధవారం పాఠశాల ప్రారంభం రోజున ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయనున్నాం. విద్యార్థులకు గ్రాండ్ వెల్కం కొనసాగుతుంది. ముల్కల్ల పాఠశాలలో కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేపట్టనున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాం.

– యాదయ్య, డీఈవో

తొలి రోజే వెళ్లేవాళ్లం



బెల్లంపల్లి: మాది ములుగు జిల్లా మదనపల్లి గ్రామం. మేము నలుగురం అన్నదమ్ములం. అందరిలో నేను చిన్నవాడిని. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక పరిస్థితులు సరిగా లేక స్వగ్రామంలో 2వ తరగతి వరకు చదివాను. 3వ తరగతి ఏటూరు నాగారంలోని గిరిజన గురుకుల పాఠశాలలో 8 ఏళ్ల వయస్సులో చేర్పించారు. అక్కడ 10వ తరగతి పూర్తి చేశాను. హన్మకొండలో ఇంటర్, హైదరాబాద్‌లో బీఈ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. మా ఊరు నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏటూరునాగారంలో పాఠశాలల పునఃప్రారంభం రోజున ఆర్టీసీ బస్సెక్కి మా ఊరివాళ్లతో కలిసి సంతోషంగా వెళ్లేవాళ్లం. బ్యాగులో బట్టలు సర్దుకుని పిండి వంటలు తీసుకెళ్లేవాడిని. మా పెద్దన్న కూడా గిరిజన గురుకుల పాఠశాలలో చదవడం వల్ల ఎలాంటి ఇబ్బందులు అనిపించలేదు. మా చిన్నతనంలో చదువుకోవడానికి పడిన కష్టాలు ఇప్పుడు లేవు.

– పి.హరికృష్ణ, ఆర్డీవో, బెల్లంపలి

డిగ్రీలో చేరే వరకు సైకిల్ లేదు



మాది కరీంనగర్ జిల్లా కొడిమ్యాల మండలం గౌరాపూర్ గ్రామం. మాది అతి సామాన్య కుటుంబం. ఐదుగురు అన్నదమ్ముల్లో నేనే చిన్నవాడిని. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక మా నలుగురు అన్నలు 3వ తరగతితోనే చదువును ఆపేశారు. నన్ను బాగా చదివించాలని అమ్మానాన్న, అన్నదమ్ములు సంకల్పించి ప్రోత్సహించారు. స్వగ్రామంలో 3వ తరగతి మాత్రమే ఉండేది. నాలుగో తరగతికి మాకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పూడూరు గ్రామానికి వెళ్లాల్సి వచ్చింది. మా పెద్దన్న పాపయ్య నాతోపాటు పూడూరుకు వచ్చి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించాడు. మొదటి రోజు నాకు బిస్కెట్ ప్యాకెట్ కొనిచ్చి బాగా చదువుకోవాలని చెప్పడం ఇప్పటికీ నాకు బాగా గుర్తుంది. మా ఊరి వాళ్లతో కలిసి రానుపోనూ రోజు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాళ్లం. పదో తరగతి వరకు చేతి సంచి లేక పుస్తకాలు భుజం మీద పెట్టుకుని వెళ్లేవాడిని. పూడూరులో పదో తరగతి పూర్తి చేసి మల్యాలలో ఇంటర్‌లో చేరాను. కరీంనగర్‌లో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేశాను. నా విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే కొనసాగింది. డిగ్రీకి వచ్చే వరకు నాకు సైకిల్ కూడా ఉండేది కాదు.

– ఏ.రవికుమార్, ఏసీపీ, బెల్లంపల్లి

బడి.. ఓ మధుర జ్ఞాపకం

- జిల్లా అధికారుల మనోగతం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చిన్నతనంలో బడికి వెళ్లడం ఓ మధుర జ్ఞాపకం. తెలిసీ తెలియని వయస్సులో విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు చిన్నారులు ఇంటి నుంచి బడిబాట పడుతుంటారు. తల్లిదండ్రులు లాలించి.. బుజ్జగించి బడికి పంపిస్తుంటారు. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, వివిధ హోదాల్లో ఉన్న వారు తమ చిన్నతనంలో జరిగిన విద్యాభ్యాసంపై 'సాక్షి'తో పంచుకున్నారు. వారి మాటల్లోనే..

స్కూల్‌కు వెళ్లడం ఓ పండుగలా..



మాది నల్లగొండ జిల్లా చందంపేట మండలం చెల్ల దేవరపల్లి. ఒకటో తరగతి నుంచి ప్రాథమిక విద్యాభ్యాసం అక్కడే పూర్తయింది. తర్వాత దేవరకొండలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తయింది. డిగ్రీ వరకు అంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే జరిగింది. చిన్నప్పుడు తెలియని వయస్సులో స్కూల్‌కు బలవంతంగా వెళ్లినా, క్రమంగా బడి అలవాటుగా మారింది. మా బడి సింగిల్ టీచర్‌తో నడిచేది. వేసవి సెలవుల తర్వాత స్కూల్‌కు వెళ్లడం అనేది ఓ పండుగలా జరిగేది. పై తరగతికి వెళ్లేటప్పుడు, కొత్త పుస్తకాలు కొనుక్కొని అందరం సందడిగా స్కూల్‌కు వెళ్లేవాళ్లం. మా టీచర్లు మమ్మల్ని బాగా చూసుకునేవారు. 45 ఏళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పటికి విద్యారంగంలో చాలా మార్పులు వచ్చాయి. సర్కారు స్కూళ్లు చాలా మెరుగయ్యాయి.

– సబావత్ మోతీలాల్, అదనపు కలెక్టర్(రెవెన్యూ)

బడికి నడిచి వెళ్లేవాళ్లం..



నాన్న స్కూల్ హెడ్‌మాస్టర్. నా ప్రాథమిక విద్యాభ్యాసం ఒకటి నుంచి ఐదు వరకు గుడిహత్నూర్‌లో జరిగింది. తర్వాత బోథ్ మండలం ధన్నూర్ జెడ్పీహెచ్ఎస్(బీ)లో 5 నుంచి 10వ తరగతి వరకు సాగింది. నాలుగున్నర కిలోమీటర్ల వరకు రోజు నడిచి స్కూల్‌కు వెళ్లి వస్తుండేవాళ్లం. ఇంటర్మీడియెట్ బోథ్‌లో, నిర్మల్‌లో డిగ్రీ పూర్తయింది. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ ఎంఏ ఎకానమిక్స్‌లో చేరాను. అప్పటి గవర్నర్ సి.రంగరాజన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నాను. ఆ తర్వాత ఎస్సై ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఎవరైనా చిన్నతనం నుంచే శ్రద్ధగా చదవుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చు.

– ఆర్.ప్రకాశ్, ఏసీపీ, మంచిర్యాల

ఇంకా జ్ఞాపకం ఉంది..



శ్రీరాంపూర్: మొదటి రోజు బడికి వెళ్లిన రోజు ఇంకా జ్ఞాపకం ఉంది. ఆ రోజుల్లో ఐదేళ్లు నిండనిదే బడిలోకి అనుమతించే వారు. అందుకే గుర్తుంది. ఎండాకాలం తరువాత బడులు స్టార్టయిన వారం రోజులకు నాన్న నన్ను తీసుకెళ్లాడు. ముందు రోజే కొత్త పలక, బలపం కొనిచ్చాడు. ఇంట్లో ఉన్న పాత సంచినే అప్పుడు స్కూల్ బ్యాగ్. నేను చదివింది బెల్లంపల్లిలోని 2 ఇంక్‌లైన్ బస్తీలోని ప్రభుత్వ ప్రీ ప్రైమరీ స్కూల్. 1971లో స్కూల్‌లో అడుగుపెట్టాను. రిజిష్టర్‌లో పేరు రాయించి నాన్న ఇంటికి వెళ్లాడు. మొదటి రోజు భయం అనిపించింది. ఆ రోజు టీచర్ పలకపై ఒకటి రెండు రాసి దిద్దమన్నారు. ఆ రోజు దిద్దింది ఇంకా గుర్తుంది. అందుకేనేమో లెక్కలతో మొదలైన చదువు చివరికి ఇంజినీర్‌ను చేసి మైన్స్ మేనేజర్ వరకు తీసుకు వచ్చిందనిపిస్తుంది. రోజు నడిచే స్కూల్‌కు వెళ్లేవాణ్ని.

– ఈ.తిరుపతి, మేనేజర్, ఆర్కే 6 గని, శ్రీరాంపూర్

లక్కీడ్రా పద్ధతిన విద్యార్థుల ఎంపిక



లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులను లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేశారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు రవీందర్‌రెడ్డితో కలిసి అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశానికి 154 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 92 మందిని ఎంపిక చేశామని, వీరిలో బాలికలు 30 మంది, జనరల్ విభాగంలో 61 మంది బాలబాలికలు, అనాథ విభాగంలో ఒకరిని ఎంపిక చేశామని తెలిపారు. 5వ తరగతిలో 160 మంది దరఖాస్తు చేసుకోగా 91 మందిని ఎంపిక చేశామని, ఇందులో బాలికలు 29 మంది, జనరల్ విభాగంలో 61 మంది, అనాథ విభాగంలో ఒకరిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నామమాత్రంగా స్థాయీ సంఘ సమావేశాలు



సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, సీఈఓ గణపతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాలు నామమాత్రంగా సాగాయి. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, నిర్మాణ పనుల స్థాయీ కమిటీ, ప్రణాళిక, ఆర్థిక కమిటీల్లోని పలు అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పలు ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యులు లేకుండా నిర్వహిస్తున్నారని, కొందరు ఆర్ఎంపీలు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, ఇలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య అన్నారు. ప్రైవేట్ సూళ్లలో ఫీజుల దోపిడీ అరికట్టేలా ఫీజు నియంత్రణ అమలు చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలోనే నకిలీ విత్తనాల సరఫరా జరుగుతున్నాయని, త్వరలోనే ఆధారాలతో సహా బయట పెడతానని తాండూర్ జెడ్పీటీసీ బానయ్య అన్నారు. వ్యవసాయాధికారులు గ్రామాలను దత్తత తీసుకుని పంటలు సమృద్ధిగా సాగు చేసేలా ప్రోత్సాహం అందించాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, సీఈఓ గణపతి, డీపీఓ వెంకటేశ్వర్ రావు, డీఈఓ యాదయ్య, జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ'పై ఇంటింటి సర్వే

- ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు
- జిల్లాలో 456 మంది ఎన్యుమరేటర్లు
- పది రోజులపాటు కొనసాగింపు



ఇంటింటి సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

దండేపల్లి: ఇంటింటికి శుద్ధజలం అందించేందుకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రంలో ప్రతీ ఇంటికి నీరందిస్తున్న ట్లు అధికార యంత్రాంగం నివేదించింది. ఈ పథ కం క్షేత్రస్థాయిలో ఎలా ఉంది.. ఇంకా ఏం కావా లి అనే దానిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటింటి సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. నల్లా కనెక్షన్ లేని ఇల్లు ఉండకూడదని, ఇందుకోసం ప్రత్యే క యాప్ రూపొందించి వివరాలు నమోదు చేయిస్తోంది. జిల్లాలో ఈ సర్వే మంగళవారం మొదలైంది. జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల్లోని సుమారు 640 ఆవాసాల్లో లక్షా 34వేల ఇళ్లకు మి షన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నాయి. నీటి సరఫరా, సమస్యలు తెలుసుకునేందుకు 456 మంది ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చి ఇంటింటి సర్వే చేయిస్తున్నారు. ఒక్కొక్కరూ రోజుకు కనీ సం 50 ఇళ్లకు తగ్గకుండా సర్వే చేసి యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. 15అంశాలను యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో డీఆర్డీఓ, డీపీవో, మిషన్ భగీరథ, ఇంట్రా ఈఈలు తదితర అధికారుల పర్యవేక్షణలో పది రోజులపాటు సర్వే సాగుతుంది. ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలను ఎన్యుమరేటర్లుగా నియమించారు. క్షేత్రస్థాయిలో వీరంతా ఇంటింటా తిరిగి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు.

నమోదు ఇలా..

యాప్ ఓపెన్ చేయగానే అందులో ఇంటి యజమాని పేరు, ఆధార్, పురుషుడు, స్త్రీ, కులం, సెల్ నంబరు, ఇంటి చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు, తాగునీరు సరఫరా ఉందా, ఏ పథకం ద్వారా అందుతుంది. లబ్ధిదారునితో కలిసి ఇంటి ఫొటో, తాగునీటి నల్లా ఫొటో, ఎన్ని రోజులకోసారి నీరు సరఫరా అవుతున్నాయి, ఇంకా ఏయే అవసరాలు ఉన్నాయి.. తదితర వివరాలు నమోదు చేస్తారు. ఆ తర్వాత యజమాని సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది.

ప్రత్యేక శిక్షణ ఇచ్చాం..

మిషన్ భగీరథపై జిల్లాలో పది రోజులపాటు ఇంటింటి సర్వే కొనసాగుతోంది. ఎన్యుమరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. వారంతా ఇంటింటికి వెళ్లి భగీరథపై సర్వే చేస్తున్నారు. ప్రత్యేక యాప్‌లో వివరాలు పొందు పరుస్తారు.

– వెంకటేశం,
మిషన్ భగీరథ ఇంట్రా, ఈఈ, మంచిర్యాల

రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల విజేతలు వీరే

మంచిర్యాలఅర్బన్: జిల్లా నృత్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల విజేతలను సంస్థ అధ్యక్షుడు రాకం సంతోష్ ప్రకటించారు. శాస్త్రీయ నృత్యం సీనియర్ విభాగంలో ఆదిలాబాద్‌కు చెందిన వెన్నెల లాస్య(ప్రథమ), నస్పూర్‌కు చెందిన శ్రీనిధి నృత్యాలయం బృందం(ద్వితీయ), శాస్త్రీయ నృత్యం జూనియర్ విభాగంలో జన్నారానికి చెందిన నటరాజ్ కళా క్షేత్రం బృందం(ప్రథమ), నస్పూర్‌కు చెందిన శ్రీనిధి నృత్యాలయం కళాకారుల బృందం(ద్వితీయ), జానపద జూనియర్ జూనియర్ విభాగంలో గోదావరిఖనికి చెందిన ప్రశాంత్ గ్రూపు(ప్రథమ), మంచిర్యాల వర్షిణీ గ్రూపు(ద్వితీయ), జానపద సీనియర్ విభాగంలో మంచిర్యాల అర్జున్ హార్ట్‌బీట్ గ్రూపు (ప్రథమ), రామకృష్ణాపూర్ సమీక్షా అకాడమి గ్రూపు(ద్వితీయ), సినిమా వెస్ట్రన్ జూనియర్ విభాగంలో మంచిర్యాల సత్యశ్రీ డ్యాన్స్ అకాడమీ(ప్రథమ), జన్నారం నటరాజ్ కళాక్షేత్రం బృందం(ద్వితీయ), సీనియర్ విభాగంలో ఆసిఫాబాద్ డీఎస్ కంపెనీ గ్రూపు(ప్రథమ), జానపద జూనియర్ సోలో విభాగంలో నిర్మల్‌కు చెందిన అశ్విత(ప్రథమ), మంచిర్యాలకు చెందిన శ్రీమహిత ద్వితీయ స్థానం సాధించారు. వీరికి బహుమతులు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లపై ఆడియో వైరల్

చెన్నూర్: రేషన్ బియ్యం వ్యాపారి కాంగ్రెస్ నాయకుడితో మాట్లాడిన ఆడియో మంగళవారం వైరల్‌గా మారింది. 'డీలర్ల వద్ద రేషన్ బియ్యం కొంటున్నావా.. కాంగ్రెస్ నాయకులు ఎవరైనా వెనుకాల ఉన్నారా' అంటూ ఓ కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించగా.. సదరు బియ్యం వ్యాపారి స్పందిస్తూ 'ప్రజలు తినడం లేదు.. వారి వద్దనే కొంటున్నా.. మీకు వచ్చిన ఇబ్బంది ఏమిటి?' అని ఎదురు ప్రశ్నించాడు. 'ఎమ్మెల్యేకు చెడ్డ పేరు వస్తుంది' అని కాంగ్రెస్ నాయకుడు అనగా.. 'నా తండ్రి గతంలో ఓ కాంగ్రెస్ నాయకుడితో తిరిగాడని అందరికీ తెలుసు.. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు ఉన్నారు.. వాళ్లు చూసుకుంటారు.. మీ పని మీరు చేసుకోండి.. నా పని నేను చేసుకుంటా.. ఎవరినీ మోసం చేస్తలేను' అంటూ మాటలతో ఎదురుదాడి చేశాడు. ఈ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌కు సన్మానం



జగన్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఫర్ స్టేట్ ఆఫ్ తెలంగాణ సంయుక్త కార్యదర్శి, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్‌ను మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో న్యాయవాదులు సన్మానించారు. రంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కార్యదర్శి రవికుమార్‌గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శులు మాధవరెడ్డి, జయరాజ్, పెంటారెడ్డి, సీనియర్ న్యాయవాదులతోపాటు హయత్‌నగర్, చేవెళ్ల బార్ అసోసియేషన్ల న్యాయవాదులు జగన్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లా కోర్టు శాశ్వత భవనం ఏర్పాటుకు సహకరించాలని విన్నవించారు.

విద్యాశాఖకు త్వరగా మంత్రిని కేటాయించాలి



మాట్లాడుతున్న అక్షయ్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా విద్యాశాఖకు ఇంతవరకు మంత్రిని కేటాయించకపోవడం శోచనీయమని ఇటీవల పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసిన మేకల అక్షయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మంత్రిని కేటాయించకపోవడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతోందని తెలిపారు. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో వారు కౌన్సిలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించి విద్యావ్యవస్థను అభివృద్ధి పథంలో నిలుపాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు శ్రీకాంత్‌పటేల్, మేకల మల్లికార్జున్, జాడి భూమేశ్‌నేత, రాజేందర్, నిఖిల్ ఉన్నారు.

పప్పుదినుసుల సాగుతో లాభాలు

- తొలకరి సమయంలో సాగు చేస్తే మేలు
- జిల్లాలో సాగుకు అనువైన నేలలు
- స్వల్పకాలంలో కోతకు వచ్చే అవకాశం
- మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు



మంచిర్యాలఅగ్రికల్చర్: పప్పుధాన్యాల్లో ప్రధానంగా కంది, పెసర, మినుము జిల్లాలో సాగుకు అనుకూలమైన పంటలు. ఇందులో తక్కువ రోజుల్లో చేతికి వచ్చే పంటలు పెసర, మినుము. వీటి సాగుపై రైతులు అమిత ఆసక్తి చూపుతున్నారు. తొలకరి తర్వాత సాగు చేసుకుంటే ఈ పంటలు నేలను సారవంతం చేయడమే కాకుండా 60 నుంచి 75 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ప్రస్తుతం పప్పుధాన్యాలకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఏ పప్పు ధర చూసినా రూ.100కు పైనే ఉంది. పప్పుధాన్యాల సాగుతో స్వల్పకాలంలో దిగుబడులు పొందడమే కాకుండా మంచి లాభాలు ఆర్జించవచ్చని ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్ వివరిస్తున్నారు. కొద్దిపాటి సలహాలు, సూచనలు పాటించి సాగు చేస్తే పసిడిసిరులు కురిపిస్తుందని చెబుతున్నారు.

అన్ని నేలలకు అనువైన 'పెసర'

పంట మార్పిడిలోనూ అంతరపంటగాను పెసర అత్యంత అనువైనది. తక్కువ కాలంలో కోతకు వస్తుంది. ఆయకట్టు ప్రాంతాలు, చెరువులు, బోరుబావుల కింద రైతులు వరిసాగు చేసే భూముల్లోనూ ముందుగా పెసర వేసుకుని తర్వాత వరి నాటుకోవచ్చు. పెసర కోసిన తర్వాత పచ్చిరొట్ట ను భూమిలో కలియదున్నితే భూసారం పెరుగుతుంది. పెసర అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. చౌడునేలలు, నీరు నిలిచే భూములు మాత్రం పనికి రావు.

పెసరలో రకాలు

ఎల్‌జీ-407 పెసర రకం 70-75 రోజులకు చేతికి వస్తుంది. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరిగి కాయలు మొక్క పైభాగాన కాస్తాయి. గింజలు మెరుస్తూ మధ్యస్థ లావుతో ఉంటాయి. ఎల్లోమొజాయిక్ తెగులు, నల్ల ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుంది. ఎల్‌జీజీ-410 రకం 75 రోజుల పంట. దిగుబడి ఎకరాకు 5-6 క్వింటాళ్లు వస్తుంది. మొక్కలు నిటారుగా గుబురుగా పెరుగుతాయి. గింజలు పెద్దవిగా ఉండి మెరుస్తుంటాయి. ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్‌జీజీ-50 రకం 65 నుంచి 70 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు మధ్యస్థ ఎత్తులో ఉండి గుబురుగా కనిపిస్తాయి. పంట చేతికివచ్చే సమయంలో వర్షాలు కురిసినప్పటికీ గింజలు కొంతమేర చెడిపోవు. పూసా-105 రకం 65-70 రోజుల పంట. దిగుబడి 4-6 క్వింటాళ్లు వస్తుంది. అన్ని ప్రాంతాలకు అనువైనది. కాయలు మొత్తం మొక్క పైభాగంలోనే ఉండి అన్నీ ఒకేసారి కోతకు వస్తాయి. పల్లాకు తెగులు, ఆకుమచ్చ తెగులును కొంతమేర తట్టుకుంటుంది. ఎంజీజీ-295 రకం 65-70 రోజుల పంట. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్కలు నిటారుగా పెరుగుతాయి. నల్లమచ్చ తెగులును తట్టుకుంటుంది. గింజ మధ్యస్థ లావుగా ఉండి మెరుస్తూ ఉంటుంది. ఎంజీజీ-347 రకం పంటకాలం 65-70 రోజులు. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. మధ్యస్థ రకం. మొక్కలు నిటారుగా.. గుబురుగా పెరుగుతాయి. కాయలు మొక్క పైభాగాన కాసి ఒకేసారి కోతకు వస్తాయి. ఆకుమచ్చ తెగులు, ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. డబ్ల్యూజీజీ-37 రకం 60 నుంచి 65 రోజుల పంట. గింజలు ఆకర్షణీయంగా, పచ్చగా నిగనిగలాడుతుంటాయి. అన్ని నేలల్లో సాగు చేసుకోవచ్చు. పంటంతా ఒకేసారి కోతకు వస్తుంది. ఎల్లోమొజాయిక్ తెగులును తట్టుకుంటుంది. 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎల్‌జీజీ-460 రకం 60-65 రోజుల పంట. ఎకరాకు 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. కాయలు గుత్తులుగుత్తులుగా ఉండి కోయడానికి సులభంగా ఉంటుంది. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. ఎంఎల్-267 రకం 65 రోజుల పంట. 4-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మొక్క నిటారుగా ఉండి, కింది నుంచి పైదాకా కాస్తుంది.

మినుము

పొగాకు సాగు చేసే నల్లరేగడి భూముల్లో తొలకరి వర్షాలకు పంట మార్పిడి పంటగా మినుము సాగు చేసుకోవచ్చు. పెసర, మినుమును పంట మార్పిడి పంటగా, అంతరపంటగా సాగుచేసుకోవచ్చు. పెసర, మినుము మొక్కలు గాలిలోని నత్రజనిని రైజోబియం బ్యాక్టీరియా సహాయంతో స్థిరీకరించి పంట ఎదుగుదలకు ఉపయోగపడడమే కాకుండా ఎకరానికి సుమారు 20 కిలోల వరకు నత్రజనిని నేలకు అందిస్తాయి. మినుము పంట నీటి ఎద్దడిని తట్టుకోలేదు. తేమను నిలుపుకోలేని తేలికపాటి భూములు, ఎర్రనేలలు మినుము సాగుకు పనికి రావు. పల్లాకు ఆకుముడత వైరస్ తెగుళ్లు తొలకరిలో ఎక్కువగా ఆశిస్తాయి.

మినుములో రకాలు

ఎల్‌బీజీ-20 అన్ని కాలాలకు అనువైన రకం. ఆకులు సన్నగా, పొడవుగా ముదురుగాకుపచ్చ రంగులో ఉంటాయి. పల్లాకు తెగులును తట్టుకుంటుంది. గింజలు నల్లగా మెరుస్తుంటాయి. 70-75 రోజుల పంట కాలంలో ఎకరానికి 5-6 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. డబ్ల్యూబీజీ-26 రకం మొక్కలు గుబురుగా పొట్టిగా ఉంటాయి. గింజలు సాదాగా ఉంటాయి. అన్ని కాలాలకు అనువైన రకం. పల్లాకు తెగులును కొంతమేర తట్టుకుంటుంది. పంటకాలం 70-75 రోజులు. ఎకరానికి 4-5 క్వింటాళ్ల దిగబడి వస్తుంది. టీ-9 అన్ని కాలాలకు అనువైన రకం. మొక్కలు గుబురుగా, పొట్టిగా ఉంటాయి. ఆకులు సన్నగా ముదురాకు పచ్చరంగులో ఉంటాయి. పంట కాలం 70-75 రోజులు. 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

ఐటీఐ అడ్మిషన్ల గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: ఐటీఐలో మొదటి దఫా అడ్మిషన్ల గడువు పెంచినట్లు మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధికారులకు చుక్కల దుప్పి అప్పగింత



చుక్కల దుప్పి

ఆసిఫాబాద్అర్బన్: చుక్కల దుప్పిని జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కుక్కల బారి నుంచి కాపాడినట్లు ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని మాణిక్‌గూడ పరిసర ప్రాంతాల్లో వ్యాపారి ఫయాజ్‌కు చెందిన ఫాంహౌస్‌లోకి మంగళవారం ఉదయం చుక్కల దుప్పిని కుక్కలు తరుముకుంటూ వచ్చాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న ఫయాజ్ చిన్న కుమారుడు రహమాన్ కుక్కల బారి నుంచి దానిని రక్షించి అటవీ అధికారులకు అప్పగించారు. అటవీ అధికారులు ప్రథమ చికిత్స చేసి తిరిగి దుప్పిని అడవిలోకి వదలిపెట్టారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారితోపాటు పలువురు రహమాన్‌ను అభినందించారు. డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టులు తగ్గించొద్దని వినతి



వినతిపత్రం ఇస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మైనింగ్ జీఎం పోస్టులను తగ్గించడంపై మైనింగ్ అధికారులు యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం కంపెనీ వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మైనింగ్ అధికారులు శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం పురుషోత్తంరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మైనింగ్ అధికారులు అబ్దుల్ ఖదీర్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఈ తిరుపతి మాట్లాడారు. కంపెనీలో పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి అవసరాల దృష్ట్యా 2011లో రూపొందించిన అధికారుల సంఖ్య ఆర్గనైజేషన్ ప్యాటర్న్ సరిచేయాలని చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ దశలో కంపెనీ మైనింగ్ జీఎం పోస్టులను 38, పర్సనల్ జీఎం పోస్టులు 4, ఫైనాన్స్ జీఎం పోస్టులు 2 పెంచి తదుపరి ఏర్పాటైన ఆర్గనైజేషన్ ప్యాటర్న్ కమిటీ మైనింగ్ విభాగానికి ఈ-8 పోస్టుల కింద 63 అదనపు జీఎం పోస్టులు మైనింగ్ సెకండ్ క్లాస్‌కు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ సమయంలో మైనింగ్ జీఎం పోస్టులను తగ్గించడం సరికాదని పేర్కొన్నారు. వీటిని కొనగించాలని కోరారు. ఈ సందర్భంగా వారు సింగరేణి సీఎండీ, సీఎంవోఏఐ సింగరేణి బ్రాంచ్ అధ్యక్షులకు లేఖలు రాశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాంనర్సయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: డిపెండెంట్ల వయోపరిమితి పెంపు ఐఎన్‌టీయూసీ పోరాట ఫలితమేనని యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 6 గనిపై నిర్వహించిన బాయిబాట కార్యక్రమంలో కార్మికులను కలిసి మాట్లాడారు. కారుణ్య ఉద్యోగాల్లో వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచాలని తాము పలుదఫాల్లో ఆందోళనలు, నిరసనలు తెలియజేశామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు యాజమాన్యం వయస్సు పెంపు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి, పటాకులు కాల్చారు. అనంతరం గని అధికారులను కలిసి గనిలోని సమస్యలు పరిష్కరించాలని, క్యాంటీన్, లాకర్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జాతీయ సమితి సభ్యుడు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, ఏరియా నాయకులు తిరుపతిరాజు, వెంగళ కుమారస్వామి, పేరం రమేశ్, జీవన్‌రెడ్డి, మహేశ్, తిరుపతి, మహేందర్ పాల్గొన్నారు.

పోరాటం ఫలించింది



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వీరభద్రయ్య

ఏఐటీయూసీ కృషి ఫలితమే..

ఏఐటీయూసీ కృషి ఫలితంగానే కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయోపరిమితిని 35నుంచి 40 సంవత్సరాలకు పెంచడం జరిగిందని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 5గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. వయోపరిమితి పెంపుదలతో కార్మికుల పిల్లలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ హక్కు కోసం కార్మికులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. తమ యూనియన్ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో నాయకులంతా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు యజమాన్యం ఈ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా గనిపై పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, నాయకులు విజయ్, విశ్వనాథరెడ్డి, రాజయ్య, సంజీవరెడ్డి, రమేశ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిఖని భూగర్భగని తనిఖీ



షాఫ్ట్‌మ్యాన్ వైండింగ్‌ను పరిశీలిస్తున్న సభ్యులు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని భూగర్భ గనిని మంగళవారం రక్షణ తనిఖీ బృందం (సేఫ్టీ ఆడిట్ టీమ్) సందర్శించింది. జనరల్ మేనేజర్ కార్పొరేట్ కే గురువయ్య ఆదేశాల మేరకు మ్యాన్‌వైండింగ్ షాఫ్ట్ రక్షణ తనిఖీ బృందం గని మ్యాన్ వైండింగ్ పని తీరు, నాణ్యతను ఉపరితలంలో నిశితంగా పర్యవేక్షించారు. ఆతర్వాత గని భూగర్భంలోకి దిగి షాఫ్ట్ ఫిట్ బాటమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మెరుగైన మ్యాన్‌వైండింగ్ పనితీరు కోసం గని అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మ్యాన్‌వైండింగ్ సిస్టంను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తనిఖీ బృందం అధికారులు ఏ రాజేశ్వర్‌రెడ్డి (ఏజీఎం), ఎం.రామానందం, ఎం.తిరుమల్‌రావు, జే నాగరాజు (ఏజీఎం ఈఅండ్ఎం), డీవైజీఎం బీ సీతారామ్, గని ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయప్రసాద్, ఏఎస్వో ఎం.రవీందర్, గ్రూప్ ఇంజినీర్ బసవరాజు, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఎస్వో రాజు, గని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్బీఐ సీఎస్పీ నిర్వాహకుడిపై పోలీసులకు ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఎస్బీఐ వద్ద గల సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు రమేశ్ తీరుపై బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్యాష్ డ్రా చేసి డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకుంటున్నాడని పలువురు బాధితులు ఆరోపిస్తూ సోమవారం రాత్రి ఆందోళన చేశారు. డిపాజిట్ చేయమని ఇచ్చిన డబ్బులను సొంత అవసరాలకు వాడుకుని ప్రస్తుతం డబ్బులు లేవని చెబుతున్నాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

అమ్మ ఆదర్శ పనుల పరిశీలన



కేజీబీవీలో పనులు పరిశీలిస్తున్న యశోధర

మంచిర్యాలఅర్బన్: బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో మంగళవారం స్థానిక కేజీబీవీ సన్నద్ధతపై సెక్టోరియల్ అధికారి యశోధర పరిశీలించారు. కేజీబీవీలో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులు, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పుస్తకాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి విద్యాలయానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎస్వో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



రవికుమార్ (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల నిడిగొండ రైల్వేగేట్ సమీపంలోని ట్రాక్‌పై చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సుర రవికుమార్ (31) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వేతనం సరిపోక కొన్నాళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రవికుమార్.. మంగళవారం ఉదయం నిడిగొండ రైల్వేగేట్ సమీపంలోని ట్రాక్‌పై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహం నుజ్జునుజ్జు కావడంతో ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు.

అందరూ గర్వపడే స్థాయికి ఎదగాలి



మమతను సన్మానిస్తున్న అధికారులు

తాండూర్: విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు సమాజం గర్వపడే స్థాయికి ఎదగాలని రాష్ట్ర విద్యాశాఖ సంచాలకుడు మల్లయ్య భట్టు సూచించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన తాండూర్ కస్తూర్బా విద్యాలయానికి చెందిన దుర్గం మమతను మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. మరింత బాగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని అభిలషించారు. ఏఎస్‌పీడీ రమేశ్, జేడీ రాజీవ్, కేజీబీవీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ హజారి శిరీష, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్వో సుమన చైతన్య, మనీషా, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన సోషల్ పరీక్షకు 79 మందికి గాను 56 మంది విద్యార్థులు హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. పరీక్షాకేంద్రాలను డీఈవో యాదయ్య తనిఖీ చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఫర్ ఎగ్జామినర్ దామోదర్‌రావు తెలిపారు.

సరిహద్దు దాటుతున్న ఎరువులు

- ధనార్జనే ధ్యేయంగా మహారాష్ట్రకు తరలింపు
- జిల్లాలో ఎరువుల కొరత ఏర్పడే అవకాశం



చెన్నూర్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. రైతులు ఎరువులు, విత్తనాలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు అక్రమాలకు తెరలేపుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు సరిహద్దు దాటి చెన్నూర్ మీదుగా జిల్లా కేంద్రానికి వస్తున్నాయి. ఇటీవల సరిహద్దు ప్రాంతంలో పోలీసులు పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలను పట్టుకున్న విషయం తెలిసిందే. విత్తనాలు మహారాష్ట్ర మీదుగా అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. మహారాష్ట్రలో ఎరువుల కొరత ఉండడంతో చెన్నూర్ కేంద్రంగా కొందరు వ్యాపారులు ఈ ప్రాంత రైతుల పేరుతో మహారాష్ట్రకు అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలిసింది. యూరియా, కాంప్లెక్, డీఏపీ ఎరువులు సరిహద్దు దాటిపోతున్నట్లు సమాచారం.


అధిక ధరలకు విక్రయిస్తూ..

యూరియా బస్తాకు రూ.300 ఉండగా మహారాష్ట్రలో రూ.350 పలుకుతోంది. ఇలా ప్రతీ ఎరువు బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అధికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో రాత్రికిరాత్రే ఎరువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిసింది. చెన్నూర్ ప్రాంత అవసరాల కోసం తీసుకువచ్చిన ఎరువులు మహారాష్ట్రకు తరలిస్తే రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో ఎరువుల కొరత ఏర్పడే అవకాశం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

ఒక జిల్లాకు కేటాయించిన ఎరువులు, విత్తనాలు పక్క జిల్లాకు పంపించడమూ నేరమే. ఏ జిల్లాకు కేటాయించిన ఎరువులు, విత్తనాలు ఆ జిల్లా రైతులకు మాత్రమే విక్రయించాల్సి ఉంది. పక్క జిల్లా, పక్క రాష్ట్రానికి తరలిస్తే కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పట్టుబడితే డీలర్ లైసెన్స్ రద్దు చేసే అధికారం అధికారులకు ఉంది. ఈ మేరకు ప్రభుత్వం కూడా కఠిన ఆదేశాలు జారీ చేసింది.

చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశాం



ఎరువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రామగుండం సీపీ, మంచిర్యాల కలెక్టర్ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశం ఏర్పాటు చేశాం. ఎరువులు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. జయశంకర్ భూపాల్‌పల్లికి తరలివెళ్లకుండా అన్నారం బ్యారేజీపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిత్యం ఎరువుల షాపులు తనిఖీ చేస్తున్నాం. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. అక్రమ రవాణా సాగిస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదు. – మార్క్ గ్లడ్‌స్టోన్, ఇన్‌చార్జి వ్యవసాయాధికారి, చెన్నూర్

ఆర్టీసీ ఉద్యోగిపై దాడి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఆన్‌డ్యూటీలో ఉన్న ఉద్యోగి(కంట్రోలర్)పై దాడి చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇద్దరు వ్యక్తులు షాపింగ్ చేయడానికి వచ్చి ఇన్‌గేట్ (అనుమతిలేని చోట) వద్ద కారు పార్కింగ్ చేసి వెళ్తుండగా కంట్రోలర్ గమనించారు. కారును అక్కడ నుంచి తీసివేయాలని సూచించారు. దీంతో వారిద్దరు ఉద్యోగి జమాల్‌పాషాపై పిడిగుద్దులు గుద్దారు. స్థానికులు, ఆర్టీసీ సిబ్బంది జోక్యంతో గొడవ సద్దుమణిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆర్టీసీ కంట్రోలర్ జమాల్‌పాషా దాడి విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని సీఐ బన్సీలాల్ తెలిపారు.



ఆర్టీసీ ఉద్యోగిపై దాడి చేస్తున్న వాహనదారులు